క్లుప్తంగా

ఆర్టీసీ విలీనం ఘనత సీఎం జగన్‌దే



పొనకా దంపతులను సత్కరిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

గూడూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్ఎంయూ గౌరవాధ్యక్షుడు పొనకా శివకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, నాయకులు శివకుమార్‌రెడ్డిని వారి నివాసంలో యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ శ్రీనివాసులు, కార్యదర్శులు ఎస్‌కే ఎం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీని సకాలంలో పూర్తి చేయాలి

వెంకటగిరిరూరల్: ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి లబ్ధిదారుల దగ్గర నమోదు చేయించుకోవాల్సిన ఈకేవైసీని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పాపమాంబపురం సచివాలయాన్ని గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేత



ట్రైసైకిళ్లు అందిస్తున్న ట్రస్టు అధినేత శ్రీనివాసులు

చిల్లకూరు: మండలంలోని చేడిమాల గ్రామంలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం పలువురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందించారు. అలాగే నెలబల్లి రెట్టపల్లి పంచాయతీ పరిధిలోని నక్కల కాలువ కండ్రిగ పాఠశాలలోని చిన్నారులతో కలిసి సంక్రాంతి వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్య నాయుడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సర్పంచ్ శంకరమ్మ

వాకాడు: మండలంలోని వాలమేడు గ్రామంలో జెడ్పీటీసీ రాతు రామకృష్ణ దాతృత్వంతో పేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాతు శంకరమ్మ చేతుల మీదుగా గ్రామంలో నిత్యావసర సరుకులను 65 కుటుంబాలకు అందజేశారు. .

దుమ్ము పడకుండా చర్యలు తీసుకోండి

సైదాపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో దుమ్ము, ధూళి పడకుండా మైనింగ్ యాజమానులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మైనింగ్ యాజమానులు, మేనేజర్లతో సమీక్షించారు. మైనింగ్ రవాణా కారణంగా రోడ్లు దెబ్బతినడంతో పాట విపరీతమైన దుమ్ము వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో గురువారం తహసీల్దార్ ఆధ్వర్యంలో అసైన్‌మెంట్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హుల వివరాలను గ్రామసభలో చదివి విన్పించారు.

బాధ్యతల స్వీకరణ

కలువాయి: మండల విద్యాధికారి(ఎఫ్ఏసీ)గా ఎం.బాలకృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, పలువురు ఉపాధ్యాయులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

అట్టహాసంగా వెటరన్స్ క్రికెట్ టోర్నీ

గూడూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు వెటరన్స్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కనుమూరు హరిచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక మైదానంలో గురువారం ఆయన టోర్నీకి సంబంధించిన జట్ల డ్రస్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

వెంకటగిరిరూరల్: వ్యవసాయ పొలాలకు దూరంగా గుట్టుగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సెబ్ సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మండలంలోని పాపమాంబపురం అగ్రహారానికి చెందిన కిన్నెర వెంకటేశ్వర్లు గ్రామ సమీపంలోని కై వల్యానది ఒడ్డున నాలుగు లీటర్లు సారాతో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. అతనిపై ఇప్పటికే రెండు సారా కేసులు ఉన్నాయన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ఆరంభం

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని చింతవరం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం చింతవరం ప్రీమియం లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు ఆరంభమయ్యాయి. నిర్వాహకులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఏటా యువకులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పండుగకు వేళాయె..

- గూడూరులో కిక్కిరిసిన జనం
- పండుగ సరుకుల కొనుగోలులో బిజీబిజీ



సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఫల సరుకులు దుకాణాల వద్ద జనం రద్దీ



దుస్తుల దుకాణాల వద్ద ...

గూడూరు: వర్షాలు సమృద్ధిగా పడ్డాయి.. చెరువులు నిండుకుండలయ్యాయి.. ఇప్పటికే పలువురు రైతులు వరినాట్లు వేయగా, మరికొంతమంది నాట్లు వేసే పనుల్లో ఉన్నారు. కొత్త ఏడాదిలో సంబరాలు మోసుకొచ్చే తొలి పండుగ సంక్రాంతిని సంతోషంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని కిరాణా సరుకుల దుకాణాలు, దుస్తుల దుకాణాలన్నీ కొనుగోలుదారులతో నిండాయి. అలాగే ఎక్కడెక్కడో ఉన్న వారు సంక్రాంతికి సొంత ఊరికి వస్తున్నారు. దీంతో పల్లెల్లో ఇప్పటికే సందడి మొదలైంది. పండుగ వేళ జనం రద్దీతో పట్టణంలోని నారాయణమ్మవీధి, రాజావీధి, ఆస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాలు జనాలు, వాహనాలతో రద్దీగా మారాయి. అలాగే పలు కూడళ్ల వద్ద భోగి మంటలు వేసేందుకు అవసరమైన తాటాకు కట్టలను విక్రయిస్తున్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కేసీఎన్ గుంట పంచాయతీ ప్రజలకు సర్పంచ్ జెట్టి దేవసేనమ్మ సొంత నిధులతో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే సంజీవయ్య చేతుల మీదుగా గురువారం అందించారు. అనంతరం సర్పంచ్ దేవసేనమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేరిట సుమారు 350 కుటుంబాలకు ఉచితంగా సంక్రాంతి కానుకలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వేణు, స్థానిక నాయకులు, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత సుందరరామిరెడ్డి మృతి





సుందరరామిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఓడూరు సుందరరామిరెడ్డి (ఫైల్)

నాయుడుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి తండ్రి ఓడూరు సుందరరామిరెడ్డి గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. పార్టీ కోసం ఆయన అహర్నిశలు శ్రమించడంతో పాటు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. విషయం తెలిసి సుందరరామిరెడ్డి పార్థివదేహం వద్ద తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోదరుడు వైవీ హనుమారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ డి.శ్రీమంత్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.సుబ్రమణ్యం, మాజీమంత్రి పరసా వెంకటరత్నం ఓడూరు నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, కుమార్, శేఖర్‌రెడ్డి, తిరుపాల్, ఎంపీపీలు కె.ధనలక్ష్మి, శేఖర్‌రెడ్డి, పాండురంగ యాదవ్, రాజసులోచనమ్మ, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి దయాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో సుందరరామిరెడ్డికి నివాళులు అర్పించారు.

ఫోన్‌లో పలువురి పరామర్శ..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డిని రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌కే రోజా, మేరుగ నాగార్జున, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఫోన్‌లో పరామర్శించారు.

సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు: రంగవల్లులు సంస్కృతితో పాటు, సంప్రదాయాలకు ప్రతీకలని డాక్టర్ రోహిణి అన్నారు. సంక్రాంతి పండుగ ప్రగతిసేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ చైతన్య స్కూల్ ఆవరణలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రగతిసేవా సంస్థ ద్వారా ఏటా 300పైగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో హర్షణీయమని సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను అభినందించారు. పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొనగా, విజేతలకు చీరలను అందజేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుప్రభ, జీవని, విష్ణువందన, స్నేహలతారెడ్డి, సంస్థ ఉపాధ్యక్షుడు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో ట్రైనీ కలెక్టర్ పర్యటన



మొక్కలు పంపిణీ చేస్తున్న ట్రైనీ కలెక్టర్ విద్యాధరి

కలువాయి: మండలంలోని తెలుగురాయపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ట్రైనీ కలెక్టర్ వి.విద్యాధరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బంది జాబ్‌చార్ట్ గురించి వివరాలు తెలుసుకున్నారు. నూరుశాతం విద్యార్థులను స్కూళ్లల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను ఆకర్షించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట డ్వామా ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ నారాయణ, విద్యాధికారి బాలకృష్ణారెడ్డి, సీఆర్‌పీలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎన్‌ఎస్‌ఎఫ్ క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్‌ఎస్‌ఎఫ్ క్రీడాకారులు

నాయుడుపేటటౌన్: తిరుపతి జిల్లా చవటగుంట గ్రామంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ స్పోర్ట్స్ మీట్‌లో నాయుడుపేట ఎన్‌ఎస్‌ఎఫ్(నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్) క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ఎన్‌ఎస్‌ఎఫ్ వ్యవస్థాపకులు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. సీహెచ్ కృపా ప్రిన్సి మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో 3వ స్థానంలో నిలిచింది. సీహెచ్ ధీనా ప్రిన్సి 400 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం సాధించింది. 60 మీటర్ల పరుగు పందెంలో బాలుర విభాగంలో మహీధర్, బాలికల విభాగంలో నిహారిక ప్రథమ స్థానాలు సాధించగా, మయూరి రెండవస్థానం దక్కించుకుంది. వీరికి నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు పతకాలను అందించినట్లు లక్ష్మయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కలికి సుదీప్ రెడ్డి అభినందించారు.

ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



ఏపీఐఐసీ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

గూడూరు: గూడూరులో ఆటోనగర్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. విజయవాడలోని ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం ఆయన అక్కడి చీఫ్ ఇంజినీర్ వివేకానందరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరిరావును కలిశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు వాతావరణం కాలుష్యం అవుతుందని వెంటనే ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు శాఖల అధికారులను కలిసి, సమస్యలపై చర్చించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఓజిలి: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ లాజరస్ అన్నారు. మండల పరిధిలోని మాచవరం గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో వీఆర్వో నాగరాజు గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మాచవరం గ్రామపరిధిలోని సర్వేనంబర్లు 1, 3 9, 10లోని 20 ఎకరాల భూములను తిరుములపూడి గ్రామస్తులు అక్రమంగా రాత్రి సమయాల్లో ట్రాక్టర్లతో భూములను దున్ని గట్లు వేసేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ మౌనిక, నాయకులు మధుసూదన్‌రెడ్డి తమకు ఫిర్యాదు చేయడంతో స్పందించి ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసి దండోరా వేయించామన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

ఓజిలి: నాయుడుపేట ఏఎంసీ గోదాములో పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏఎంసీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మండల ఏఎంసీ డైరెక్టర్లు దీప్తి, ప్రవీణ, సుబ్బారాయులు, కృష్ణయ్య, ఎక్స్ అఫీషియో సభ్యురాలు శోభారాణి శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి సన్మానించారు. అలాగే ఎంపీటీసీ ప్రసాద్‌రాజు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, బాబురెడ్డి, గోపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, సుబ్బారావు యాదవ్, దామోదర్‌రాజు, రామ్మూర్తిరాజు తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆనం పర్యటన

రాపూరు: రాపూరులో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన వెలువడింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే సర్వసభ్య సమావేశం ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పెంచల ప్రసాద్‌కు డాక్టరేట్



కలువాయి: కలువాయికి చెందిన మల్లా పెంచలప్రసాద్‌కు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు గురువారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన తెలుగు అధ్యయన శాఖలో 'వందేళ్ల కథకు వందనాలు–అనుశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథం సమర్పించినందుకు గానూ ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈ గ్రంథానికి పర్యవేక్షకులుగా ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి వ్యవహరించారు. పెంచలప్రసాద్ రాసిన అనేక పరిశోధనా పత్రాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

శ్మశాన వాటిక శుభ్రం



శ్మశాన వాటికను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గూడూరు: పెద్దల పండుగకు హిందూ శ్మశాన వాటికను మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ శుభ్రం చేయించారు. చాలారోజుల తరువాత శ్మశానాన్ని శుభ్రం చేయడంతో ఇన్ని సమాధులు ఉన్నాయా అని పట్టణ ప్రజలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పెద్దల పండుగ సంక్రాంతి నాడు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మున్సిపల్ సిబ్బంది శ్మశానంలోని పరిసరాలను శుభ్రం చేశారు.

సంక్షేమ ఫలాలతో రాష్ట్రాభివృద్ధి



డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డితో ఏఎంసీ డైరెక్టర్లు

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్‌గా తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఎంసీ డైరెక్టర్లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, ఏఎంసీ వైస్ చైర్మన్ బాలసుబ్రమణ్యం, డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, భారతి, జ్యోతి నాయకులు ఉన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందిస్తున్న అదానీ కృష్ణపట్నం ఫౌండేషన్ ప్రతినిధులు

చిల్లకూరు : కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాల్లో అదానీ కృష్ణపట్నం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల విజేతలుగా గుమ్మళ్లదిబ్బ జట్టు విజేతగా నిలువగా, తమ్మినపట్నం జట్టు రన్నర్‌గా నిలిచింది. గురువారం కృష్ణపట్నం అదాని పోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్ గుమ్మళ్లదిబ్బ విజేతలకు షీల్డులతో పాటు ట్రోఫీలను అందించారు. ఫౌండేషన్ యూనిట్ సీఎస్ఆర్ హెడ్ రాజేష్‌రంజిత, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో జగనన్న నినాదమే



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు స్వాగతం పలుకుతున్న పూసలకాలనీ ప్రజలు

- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: 'మా కుటుంబానికి లక్ష వచ్చింది.. మాకు ఒకటిన్నర లక్ష వచ్చింది.. మాకైతే ఆరు లక్షలు సాయం అందింది.. సామీ మీ వల్ల మా వీధిలో మురుగునీటి కాలువ, సిమెంట్ రోడ్డు వేశారు.. కరెంట్ స్తంభం మార్చారు.. తాగునీటి పైపులైన్ వేస్తున్నారు.. అన్నీ సౌకర్యాలను కల్పిస్తున్నారు సామీ.. మీసాయం మరువలేం' అని లబ్ధిదారులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో అన్న మాటలివి. గురువారం ఆయన మన్నారుపోలూరు సచివాలయ పరిధిలోని పూసల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎదుట పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఇన్ని పథకాలు అందాయంటే సీఎం జగనన్న పుణ్యమేనని, అందుకే మళ్లీ ఆయనే రావాలి అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎమ్మెల్యేని పూలమాలలు, శాలువాలతో సత్కరించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ప్రతి గడపలో ప్రజాభిమానాన్ని చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో 600 హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తే, మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక పథకాలతో ప్రజలకు ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్, వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, పూసల బలిజ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, తిరుపాల్‌యాదవ్, కౌన్సిలర్లు మునస్వామి, సుశీల, రమ్య, మహేశ్వర్, మునిప్రసాద్, విజయలక్ష్మీ, కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి

గూడూరు: సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం రెండో పట్టణంలోని శ్రీ స్వర్ణాంధ్రభారతి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన వేడుకల్లో భాగంగా భోగి మంటలు వేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత చేతుల మీ దుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రేణుకారెడ్డి, నవకోటినాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

– గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్



సమస్యలపై మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

వాకాడు: వన్యప్రాణి విభాగం ఆంక్షలతో గత 75 ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వాకాడు మండలంలోని పలు తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో కృషి చేస్తామని గూడూరు ఆర్డీఓ కిరణ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని మొనపాళెం గ్రామ సచివాలయంలో ఉమ్మడి జిల్లాల ఉన్నతస్థాయి అధికారులతో గ్రామసభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు రహదారులు, కరెంటు, తాగునీరు, కనీస సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతున్నామని ఇటీవల స్థానిక ప్రజలు కొందరు తమ గ్రామ సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఆదేశాలతో అన్ని శాఖల అధికారులతో గ్రామ సభ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సభ ద్వారా ప్రజా సమస్యలతో పాటు అన్నిశాఖల అధికారుల అభిప్రాయాలను కూడా రికార్డు చేయడం జరిగిందన్నారు. వీటిని జిల్లా కలెక్టర్‌తోపాటు హ్యూమన్ రైట్స్ కమిషనర్‌కు నివేదిస్తామని చెప్పారు. అనంతరం టూరిజం అభివృద్ధిలో భాగంగా ఆర్డీఓ, అధికారులు నవాబుపేట, ఓడపాళెం బీచ్‌లను పరిశీలించారు. అలాగే చోళరాజుల నాటి పురాతన పంత్రంగం ఆలయాన్ని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



క్యాలెండర్లను చిన్నారులకు అందజేస్తున్న పక్కృతికుమార్

వెంకటగిరి: పట్టణంలో స్వామి వివేకానంద యువత సైన్యం వ్యవస్థాపకులు కేజే పక్కృతి కుమార్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద యువసేన క్యాలెండర్లను ఆవిష్కరించి అధికారులు, చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పక్కృతి కుమార్ మాట్లాడుతూ నేటి తరం యువత మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని బలిజపాళెంలోని శ్రీధర్మరాజ స్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గూడూరు: పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో గురువారం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కార్తీక్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక



బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

రాపూరు: మండలంలో 2020–2021, 2021–2022 సంవత్సరాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల్లో సుమారు రూ.27 కోట్లకు పనులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించి అధికారులకు నివేదిక అందించారని, వాటి ఆధారంగా బహిరంగ విచారణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సంజీవరావు, విజిలెన్స్ అధికారి సురేష్, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఎంపీడీఓ అమోస్‌బాబు, క్వాలిటీ కంట్రోలర్ సుధాకర్, ఎస్ఆర్పీ కాంతారావు, ఏపీఎం చిన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు అవగాహన

కోట: పట్టణంలో జనసంచారంలోకి పందులు వస్తే పెంపకందారులపై కేసులు నమోదు చేస్తామని ఎంపీడీఓ భవానీ హెచ్చరించారు. గురువారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు గురువారం రెండు ట్రక్కు వాహనాల్లో దూరంగా తరలించే యత్నం చేశారు. విషయం తెలిసి పందుల పెంపకందారులు అడ్డుకున్నారు. తమ జీవన భృతిని దెబ్బతీయొద్దంటూ అధికారులను వేడుకున్నారు. చివరకు ఎంపీడీఓ భవానీ జోక్యం చేసుకుని పందుల పెంపకందారులను కార్యాలయానికి పిలిపించి వారికి అవగాహన కల్పించారు. ఇదే చివరి అవకాశమని మరోసారి పందులు జనసంచారంలోకి వస్తే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు.

బాధ్యతగా పని చేయండి

సైదాపురం: సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులను నిర్వర్తించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ అన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన అసైన్‌మెంట్ భూములపై మండలంలోని గులించెర్ల గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆయన మండలంలోని చీకవోలు, కొమ్మిపాడు, చాగణం, మర్లపూడి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అమలు చేస్తోందన్నారు. అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకునే అర్హులైన రైతులకు గ్రామసభ ద్వారా ఆమోదిస్తామని వీఆర్ఓ తెలిపారు.